




సత్యాగ్రహ దీక్షలో అభివాదం చేస్తున్న సిపిఎం నాయకులు



కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఈ సారీ నిరాశే మిగిలింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారీ కరువు జిల్లాకు కేంద్రం ఏదోసాయం చేస్తుందని ఆశ పెట్టుకోవడం, తీరా చూస్తే ఎలాంటి కేటాయింపులు లేకుండా ఉసూరుమనిపించడం పరిపాటిగా మారుతోంది. బిజెపి పాత మోసాన్నే మళ్లీ జిల్లాకు చేసింది. బుధవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతీరామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరోమారు జిల్లాకు మొండి చేయి చూపించారు. కేంద్ర బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాలకు నిధుల కేటాయింపులు ఆశించినంత జరగలేదు. దీంతో జిల్లావాసులకు మరోమారు తీరని నిరాశే మిగిలింది.

ఈసారి నిరాశే..

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు నామమాత్రపు కేటాయింపు
- కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రూ.47 కోట్లు
- 'భద్ర'కు నిధులు... హంద్రీనీవాకు నిధులు లేవు..



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఎప్పటిలాగానే అరకొర నిధులనే కేటాయించింది. ఇక రైల్వేకు సంబంధించి కొత్త రైళ్లు ఏవీ రాలేదు. గుంతకల్లు డివిజన్‌కు ఎన్ని నిధులు కేటాయించారన్నది ఇంకా స్పష్టత రాలేదు. పింకు బుక్కు వస్తే డివిజన్ పరిధిలో నిధుల కేటాయింపులపై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత రానుంది. ఏది ఏమైనా ఈ బడ్జెట్‌లో వెనుకబడిన అనంతపురం జిల్లాకు అన్యాయమే మిగిల్చిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి మొండి చేయి

విభజన హామీలో భాగంగా అనంతపురం జిల్లాలో ఏర్పాటైన కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఈ ఏడాది నిధుల కేటాయింపులు మొక్కుబడిగానే జరిగాయి. గతేడాది కూడా కేటాయించినది తక్కువే అయినా అందులోనూ విడుదల చేసింది మరింత తక్కువనే చెప్పాలి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రూ.56.6 కోట్లు కేటాయించారు. కాని సవరణ బడ్జెట్‌లోకి వచ్చే సరికి ఆ నిధులు కేవలం 13.08 కోట్లకు తగ్గిపోయాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి చూస్తే రూ.47.40 కోట్లు కేటాయించారు. ఇందులో విడుదలయ్యేది ఎంతన్నది ప్రశ్నార్థకమనే చెప్పాలి. ఇప్పటికే కనీస మౌలిక సదుపాయాలు కూడా లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అయినా ప్రభుత్వం కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధుల కేటాయింపులు జరపకపోవడం గమనార్హం.

పక్కనున్న భద్రకు రూ.5300కోట్లు కేటాయింపు...

జిల్లాకు పక్కనున్న కర్నాటక రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పేరుతో తుంగభద్ర డ్యామ్‌పై కర్నాటక నిర్మిస్తున్న భద్ర డ్యామ్‌కు రూ.5300 కోట్లు నిధులను కేటాయించింది. తుంగభద్రపై జరుగుతున్న ఈ నిర్మాణాలపై ఆంధ్రప్రదేశ్‌లో అభ్యంతరాలున్నాయి. ప్రధానంగా తుంగభద్ర డ్యామ్‌పై ప్రాజెక్టులు నిర్మాణం చేపడితే వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో నీరు రావడం ఆలస్యమయితే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీటి విడుదలపై ప్రభావం పడుతుంది. ఇది ఆలస్యమయితే అనంతపురం జిల్లాకు తాగునీటి ఇక్కట్లు తప్పవు. ఇటువంటి ప్రాజెక్టుకు కర్నాటక ప్రభుత్వం నిధులు కేటాయించింది. అయితే ఇదే సమయంలో అనంతపురం జిల్లాకు మరోరూపంలో నీరందించే హంద్రీనీవాను పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుంతకల్లు రైల్వే డివిజన్‌కైనా నిధులు పెరిగాయా ?

దక్షిణ మధ్య రైల్వేలో ప్రధానమైన డివిజన్‌లో గుంతకల్లు ఒకటి. దీనికి నిధుల కేటాయింపులు ఏ మేరకన్న దానిపై స్పష్టత లేదు. కొత్త రైళ్లు అయితే ఏవీ ఈ ప్రాంతానికి కేటాయించలేదు. ఇక అభివృద్ధికి నిధులు ఎన్ని కేటాయించారన్నది స్పష్టత రావాలంటే పింక్ బుక్ రావాల్సి ఉంటుంది. అది వస్తేగానీ ఈ ప్రాంతంలో కొత్తలైన్లు, పాత లైన్లకు నిధులు ఎన్ని కేటాయించారన్నది తెలియదు.

కార్పొరేట్లకు దోచిపెట్టే బడ్జెట్

వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి

కార్పొరేట్లకు పూర్తిగా దోచిపెట్టే బడ్జెట్ ఇది. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు వారికి అప్పగించడం ద్వారా రూ.65 వేల కోట్లు నిధుల సమకూరుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీన్ని బట్టి ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుకు ఏ రకంగా అమ్మడానికి సిద్ధపడ్డారో స్పష్టమవుతోంది. అదే విధంగా అనంతపురం వంటి కరువు జిల్లాకు అత్యంత ప్రాధాన్యమైన ఉపాధి హామీకి 50 శాతం నిధులను తగ్గించి వేసింది. ఇక వెనుకబడిన ప్రాంతాలకు ఇస్తామన్న ప్యాకేజీ లేదు. కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రూ.47 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇలా అన్ని విధాలుగా ప్రజలను మోసం చేసే బడ్జెట్ ఇది.

రైతు వ్యతిరేక బడ్జెట్

నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు.

కేంద్ర ప్రభుత్వం బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2023- 24 బడ్జెట్ కార్పొరేట్ అనుకూలంగా రైతు వ్యతిరేక బడ్జెట్‌గా ఉంది. బడ్జెట్‌లో మద్దతు ధరలు రుణమాఫీ ప్రస్తావన లేదు. పంటల బీమాకు నిధులు కేటాయింపు లేకపోవడం రైతులను తీవ్ర నిరాశ పరిచింది. ఎరువుల సబ్సిడీకి నిధులు కేటాయింపు లేకపోవడం, ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమాకు నిధులు కేటాయింపు కోత పెట్టడం, వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి విభజన చట్టంలో చెప్పిన విధంగా నిధులు కేటాయింపు లేకపోవడం అన్యాయంగా ఉంది. అనంతపురం జిల్లాకు సంబంధించి హార్టికల్చర్ హబ్‌కు నిధులు కేటాయింపులు చేయక పోవడం సరికాదు. గోడౌన్స్ నిర్మించడానికి నిధులు కేటాయిస్తామని చెబుతునే, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి నిధులు కోతపెట్టారు. ఇది పూర్తిగా రైతు వ్యతిరేక బడ్జెట్‌లా ఉంది.

సామాన్యులకు ప్రయోజనంలేని బడ్జెట్

జాఫర్, సిపిఐ జిల్లా కార్యదర్శి.

సామాన్య ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనంలేని బడ్జెట్ ఇది. నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లేదు. ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపులు తగ్గించారు. ప్రయివేటు కార్పొరేట్లకు మాత్రం లాభాలను చేకూర్చే విధంగా ఈ బడ్జెట్ ఉంది. అనంతపురం వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధిని విస్మరించింది. ఎన్నికలున్న రాష్ట్రాలకు మాత్రం తాయిలాలను ప్రకటించింది. ఇది కార్పొరేట్‌లకు మేలు చేసే బడ్జెట్ తప్పా ప్రజలకు ఏ మాత్రం ఉపయోగంలేని బడ్జెట్ ఇది.



ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ అనంతపురం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వానికి పేదలు కనిపించలేదా..?



సత్యగ్రహ దీక్ష వద్దకు ర్యాలీగా వస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్,తదితరులు

- సెంటు స్థలం ఇవ్వాలని అడుగుతున్నా పట్టించుకోని పరిస్థితి
- భూమాఫియాకు మాత్రం అన్నివిధాలా సహకారం
- ప్రభుత్వం ప్రజల పక్షమా... ధనవంతుల పక్షమా.. తేల్చుకోవాలి
- జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి
- సత్యాగ్రహ దీక్షలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'ఏళ్ల తరబడి నిరుపేదలు సెంటు స్థలం లేక అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. ఎక్కడైనా కాలువల పక్కనో, వంకల పక్కనో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే వాటికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదు. పైగా వాటిని రాత్రికిరాత్రే కూల్చివేస్తున్నారు. అదే కబ్జాదారులు ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నా ఎవరూ పట్టించుకోరు. రాష్ట్ర ప్రభుత్వానికి పేదలు కన్పిస్తున్నారా.? లేదా.? అన్న సందేహం వ్యక్తం అవుతోంది.' అంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట 30 గంటల సత్యాగ్రహం చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన సత్యాగ్రహ దీక్షకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం రోడ్లు ఎక్కే దుస్థితిని ప్రభుత్వమే కల్పించడం అన్యాయంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికీ ఇళ్లు ఇచ్చామంటు ఉదరగొట్టడమే తప్పా, చేతల్లో అమలు చేసింది ఏమీ లేదన్నారు. భూకబ్జాదారులు మాత్రం వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను అప్పనంగా కబ్జా చేసి భూ మాఫియా రాజ్యంగా మార్చేశారన్నారు. ప్రజల భూములను కూడా బెదిరించి తక్కువ ధరలతో లాక్కొని అదే భూములను జగనన్న కాలనీలకు అధిక ధరలకు విక్రయించి కోట్ల రూపాయలు కొల్లకొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు సెంటు భూమి ఇవ్వడానికి చేతులు రాని పాలకులకు కబ్జాదారులకు మాత్రం వేలాది ఎకరాలను ధారాధత్తం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ధనవంతులను ప్రోత్సహిస్తూ పేదలను నట్టేముంచుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి బిజెపికి మోకరిల్లడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో అదానీ గ్రూప్‌కు వేలాది ఎకరాలు సోలార్ పవర్ కోసం అప్పగించేసిందన్నారు. రైతులకు మాత్రం తక్కువ ధర ఇచ్చి సాగు భూములను బలవంతంగా లాక్కొంటోందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం పేదల పక్షమో.. పెద్దల పక్షమో తేల్చుకోవాలన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సత్యాగ్రహం ముగిసేలోపు అనంతపురం జిల్లాలో పేదలందరికీ ఇళ్ల పట్టాలు, గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సాగు చేసుకుంటున్న వారికి సాగు పట్టాలు ఇవ్వాలన్నారు. జగనన్న ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం, అధికారుల్లో స్పందన రాకుంటే రాష్ట్ర స్థాయిలో పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. పశ్చిమ రాయలసీమ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలు పరిపాలన చేస్తున్నాయని తెలిపారు. దేశాన్ని కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుందన్నారు. జాతీయ సంస్థలన్నింటినీ ప్రయివేటీ కరిస్తోందన్నారు. దీనిని ప్రశ్నించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సాగిలాపడి ప్రజలకు నష్టం చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. అనంతరం సత్యాగ్రహ దీక్షా శిబిరం వద్దనే వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించి రోడ్డుపైనే శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు పేదలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్రకుమార్, బి.శ్రీనివాసులు, ఓ.నల్లప్ప, నాయకులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, తరిమెల నాగరాజు, ఎం.క్రిష్ణమూర్తి, వై.వెంకటనారాయణ, నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, నాగమణి, రామాంజినేయులు, ముర్తుజా, గోపాల్, ముస్కిన్, వలి, మసూద్, బాబు, ప్రకాష్‌రెడ్డి, శివప్రసాద్, రామాంజినమ్మ, జగన్‌మోహన్‌రెడ్డి, రాజారామిరెడ్డితో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పేదలు పాల్గొన్నారు.



సత్యగ్రహ నిరసనలో భాగంగా దీక్షాశిబిరం వద్ద వంటావార్పు చేసి, రోడ్డుపై సహపంక్తి భోజనం సిపిఎం నాయకులు



దీక్షాశిబిరంలోనే రాత్రి నిద్రించిన పేదలు

సుస్థిరాభివృద్ధి సూచీల్లో మెరుగవ్వాలి

కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్



బుక్కరాయసముద్రం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టరు నాగలక్ష్మి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సుస్థిరాభివృద్ధి సూచీల్లో జిల్లా మెరుగవ్వాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులతో పేర్కొన్నారు. ముఖ్యంగా ఆరోగ్య సూచీలైన మాతా, శిశు మరణాల రేటు, విద్యా సూచీల డ్రాపవుట్ నిష్పత్తిలను తగ్గించాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో బుధవారం పర్యటించారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1, జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో విద్య, వైద్య రంగాలకు సంబంధించిన అంశాలపై సచివాలయ ఉద్యోగులు నిర్వర్తించే బాధ్యతలపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైద్యం, విద్యా సూచీలు మెరుగుపడాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రాథమిక అంశాల గురించి సమాచార సేకరణ, నమోదు కీలకం అన్నారు. శాఖల మధ్య వేర్వేరు సమాచారం ఉంటే సమన్వయం లేనట్టేనన్నారు. గర్భిణులు, శిశు జననాలు, ఐదేళ్ల లోపు పిల్లల ఎత్తు, బరువు, ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్ల వంటి వివరాలు ఒక్కో శాఖ వద్ద ఒక్కో రకంగా ఉండకూడదన్నారు. జిల్లా కలెక్టర్ నియోజక వర్గ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీవో మధుసూదన్, ఎంపీడీవో తేజోష్ణ, తహశీల్దారు మోహన్ కుమార్, ఎంఇఒ గురుప్రసాద్, ఈవోఆర్డీ దామోదరమ్మ, సర్పంచి పార్వతి, డిఎంహెచ్ఒ వీరబ్బాయి, డీఈవో కృష్ణయ్య, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, పీవోఎస్ఎస్ఏ తిలక్, పంచాయతీ కార్యదర్శులు, చంద్రశేఖర్, విద్యాసాగర్, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల : నార్పల మండల కేంద్రంలోని ఒకటవ సచివాలయాన్ని, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం సందర్శించారు. సచివాలయం ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా చేరుతున్నాయా అని వెల్ఫేర్ అసిస్టెంట్‌ని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు సాయంత్రం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలో ఎంతమంది డ్రాపౌట్స్ ఉన్నారు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తదితర వివరాలను మండల విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బాలుర పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయురాలిగా మారి బోధన చేశారు. పాఠశాలలో సమస్యలను ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాలను వామపక్ష నాయకులు కలెక్టరుకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుద్రంపేట పంచాయతీకి రక్షిత తాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం అర్బన్ నియెజకవర్గం పరిధిలోని రుద్రంపేట పంచాయతీ లోని అన్ని కాలనీలకు పీఏబీఆర్, సత్యసాయి స్కీముల ద్వారా రాబోయే ఎనిమిది నెలలో రక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక విమలా ఫరూక్ నగర్ నుంచి జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు తమకు ఫ్లోరైడ్ నీరు వస్తోందని, రూ.8 వెచ్చించి తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ఎమ్మెల్యే స్పందించి రాబోయే ఎనిమిది నెలల్లో రుద్రంపేట పంచాయతీ ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, సర్పంచి సుగాలి పద్మావతి, ఉప సర్పంచి నరేంద్రరెడ్డి, ఎంపీటీసీలు, పిఎసిఎస్ డైరెక్టర్ గోవిందరెడ్డి, మాజీ ఎంపీపీ రంగంపేట గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచి కుళ్లాయప్ప, వైసీపీ నాయకులు కృష్ణవేణి, సాదిక్, ఓబులపతి, తిరుపతి నాయుడు, పురుషోత్తమ్, వార్డు మెబర్లు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత

సైబర్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయండి

జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప

ప్రజాశక్తి-అనంతపురం

సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి సైబర్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశించారు. జిల్లాలోని ఎస్ఐ ఆపై స్థాయి పోలీసు అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లతో ఎస్పీ బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళా సంబంధిత నేరాలు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాలను అరికట్టే విషయాలపై సమగ్ర దర్యాప్తు కోసం నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న కొత్త సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. సైబర్ నేరాల దర్యాప్తులో ఉపయోగించాల్సిన నూతన టూల్స్ మీద నైపుణ్యం పెంపొందించుకోవాలని, తద్వారా ప్రజలకు సకాలంలో న్యాయం చేయగలమన్నారు. సైబర్ క్రైమ్ నేరాల గురించి ఫిర్యాదు వచ్చినప్పుడు ఏ విధంగా దర్యాప్తు చేయాలి, ఎటువంటి ఆధారాలు శాస్త్రీయ కోణంలో సేకరించాలని సూచనలు చేశారు.

సాయిబాబా గ్రామోత్సవం

పెద్దవడుగూరు : షిర్డి సాయిబాబా మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామోత్సవాన్ని కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ సమీపంలో కోలాటం, చెక్కభజన, భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదాన సదుపాయం కల్పించారు. ముఖ్యఅతిథిగా ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరై బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట తాడిపత్రి మార్కెట్ ఛైర్మన్ కొట్టాలపల్లి హరినాథ్‌రెడ్డి, శేషానందరెడ్డి ఉన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ల సమావేశం

పుట్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో ఫీల్డ్‌అసిస్టెంట్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని, రోజూ రెండు వేల మందికి పనులు కల్పించాలని సూచించారు. పని ప్రదేశం నుంచి రోజూ రెండు ఫొటోలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి, టిఎలు, ఎఫ్ఎల పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

నార్పల : మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో సీతా రాముల దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. ఎంఎస్ఎంఇ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరరావు, నార్పల మాజీ సర్పంచి స్వాతిలత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, మాజీ ఎంపిటీసీ రాఘవనాయుడు, మాజీ సర్పంచ్ నారాయణస్వామి, సర్పంచి నాగర్జున, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

బుక్కరాయసముద్రం : శ్రీ పరమపిత వెంకటరమణాచార్య ట్రస్ట్ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరంచుకుని కెకె.అగ్రహారం పంచాయతీ సజీవపురం గ్రామంలో ఉన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం అన్న, వస్త్రదానం చేశారు. హెచ్‌అండ్‌టిఎడి అబ్దుల్ రసూల్, హెచ్‌అండ్‌టి నాగరాజు, ట్రస్ట్ వైస్ ఛైర్మన్ అశోక్ కుమార్, కార్యదర్శి రామాంజనేయ ఆచారి, ఉప కార్యదర్శి మల్లికార్జున , నాగభూషణం పాల్గొన్నారు.

మాచి దేవుని జయంతి

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని మల్లాపురం లేఅవుట్‌లో మడివాల మాచిదేవుని జయంతి ఉత్సవాలు బుధవారం నిర్వహించారు. పట్టణంలోని రజకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. రజక సోదర సోదరీమణులకు ఆర్ఆర్ఎస్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజకులు శంకరప్ప, తిప్పేస్వామి, వన్నూరుస్వామి, భీమ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

అనంతపురం : రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఏపీఎస్‌ఆర్టీసీ వారు బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 37 మంది దాతలు రక్తదానం చేశారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డి సుమంత్ ఆర్.ఆదోని పాల్గొని రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలోఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఆత్మకూరు : తలుపూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఇఒ బుధవారం తనిఖీ చేశారు. సాయంత్రం 10వ తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పరిశీలించి విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు. బాగా చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

పుట్లూరు : పుట్లూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో యోగానందరెడ్డి బుధవారం పరిశీలించారు. వాలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛను ఇస్తున్నారా లేక ఒకచోటికి రమ్మని ఇస్తున్నారా, డబ్బులు ఏమైనా పట్టుకుని ఇస్తున్నారా.. అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఆనందప్రసాద్ పంచాయతీ కార్యదర్శి సరోజ, వెల్ఫేర్ అసిస్టెంట్ గీత, వాలంటీర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

పెద్దపప్పూరు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంలో జూటూరు గ్రామ సచివాలయంలో డాక్టర్ ఎ.కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. కుష్టు వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించారు. స్పర్శ లేని మచ్చలు ఉంటే ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ చిన్న కంబయ్య, నాగ రత్నా, హెల్త్ ప్రొవైడర్ సుస్మలత, ఆరోగ్య కార్యకర్త నగీన, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

అనంతపురం : ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అటానమస్‌లో చదువుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటరీలు బి.ప్రణీత్, సమీరా అంజుమ్ ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు మైసూర్‌లో జరుగుతున్న జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీరీలుగా అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆర్ట్స్ కళాశాల, ఎస్కే యూనివర్సిటీ స్థాయిని దశ దిశలా వ్యాపింపచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జయలక్ష్మి, విష్ణుప్రియ, సోమశేఖర్, బాలాజీ నాయక్, గురుమూర్తి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలను కాపాడేందుకే 1033

నేషనల్ హైవే పిడిజెఎల్ జీవస్ లాల్ మీనా



అంబులెన్సులను ప్రారంభిస్తున్న పిడిజెఎల్ జీవన్‌లాల్ మీనా

ప్రజాశక్తి-అనంతపురం

దేశవ్యాప్తంగా హైవేలలో జరుగుతున్న ప్రమాదాలలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు భారతీయ జాతీయ రహదారుల సంస్థ ఒక బృహత్తర కార్యక్రమం చేపట్టిందని అనంతపురం నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ జీవస్ లాల్ మీనా తెలిపారు. బుధవారం హైవే లోని శ్రీ చైతన్య పాఠశాల సమీపంలోని మైదానంలో 9 అంబులెన్స్ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భవ్య హెల్త్ సర్వీసెస్ ఏజెన్సీ ద్వారా నాలుగు జిల్లాల పరిధిలో ప్రమాదాలలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు 12 అంబులెన్సులను ఏర్పాటు చేశామన్నారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల, సత్యసాయి జిల్లాలను కలుపుతూ నేషనల్ హైవే పరిధిలో ఉన్న 10 టోల్ ప్లాజాల వద్ద ప్రతి 50 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 12 అంబులెన్సులను భారతీయ జాతీయ రహదారుల సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. నేషనల్ హైవే 44 లోని హైదరాబాదు-బెంగళూరు సెక్షన్లో కర్నూల్ నుండి ఏపీ కర్ణాటక సరిహద్దు వరకు 250 కిలోమీటర్ల పొడవునా అమ్మకుతాడు కాసేపల్లి మరో ప్లాజాల వద్ద అంబులెన్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన 20 నిమిషాల లోపు బాధితులను గోల్డెన్ అవర్ సమయంలో సమీపంలోని ఆసుపత్రికి తరలించడంలో ఈ అంబులెన్సులు కీలకపాత్ర పాత్ర వహిస్తాయని అన్నారు. అంబులెన్స్ సిబ్బంది రోమా కేర్ చికిత్స అందించేందుకు తగిన శిక్షణ పొందారని తెలిపారు. ప్రమాద సమయంలో దెబ్బతిన్న వాహనాలను తొలగించుటకు క్రేన్ వంటి సౌకర్యం కల్పించామని చెప్పారు. వివిధ జాతీయ రహదారులను అభివృద్ధి చేసే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నాయని వెల్లడించారు. హైవేలలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు 1033 నెంబరుకు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే టీం లీడర్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ మేనేజర్ శ్రావణ్ కుమార్, పిఎ రుషికేష్, నేషనల్ హైవే సిబ్బంది రఘు, భవ్య హెల్త్ సర్వీసెస్ సిబ్బంది, ప్రాజెక్టు మేనేజర్ మోహన్ డీజీఎం సంపత్, వెహికల్ మేనేజర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనంతలో అజ్ ఫన్ డేట్స్ అండ్ నట్స్ ప్రారంభం



ఆజ్‌ఫన్ డేట్స్ అండ్ నట్స్ షోరూం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం హైవే లోని రెనాల్ట్ షోరూం సమీపంలో నూతనంగా నిర్మించిన అజ్ ఫన్ డేట్స్ అండ్ నట్స్ 150వ బ్రాంచ్‌ని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ కుట్టి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు రాష్ట్రాలలో తమ సంస్థ ప్రజలకు నాణ్యమైన డేట్స్ అండ్ నట్స్ అందిస్తున్నట్లు తెలిపారు. సుమారు 6 రాష్ట్రాలలో ప్రజాధరణ పొందిన సంస్థ అవుట్‌లెట్‌ను రాయలసీమలో తిరుపతిలో ప్రారంభించామని, ప్రస్తుతం అనంతపురంలో ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇప్పటికే ప్రధాన నగరాలైన చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, కేరళ, పాండిచ్చేరి వంటి నగరాలలో అత్యంత ప్రజాదరణ పొందిందని తెలిపారు. ప్రజలకు అత్యుత్తమైన నాణ్యమైన ఖర్జూరం, డ్రై ఫ్రూట్స్ చాక్లెట్లను, ఆల్మండ్, షుగర్ ఫ్రీ చాక్లెట్స్ వంటి అనేకమైన వాటిని తమ బ్రాంచిలో అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అనంతపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిప్పారెడ్డి, అజ్ ఫన్ డేట్స్ అండ్ నట్స్ సల్మాన్, పలువురు ప్రముఖులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో ప్రాణాలకే ముప్పు



మాట్లాడుతున్న తహశీల్దారు బ్రహ్మయ్య

ప్రజాశక్తి-ఉరవకొండ

బాల్య వివాహాలతో ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని విడపనకల్ తహశీల్దార్ బ్రహ్మయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైకెపి కార్యాలయ ప్రాంగణంలో మండల స్థాయి చైల్డ్ లైన్ అడ్వైజరీ పోర్డు సమీక్ష సమావేశాన్ని చైల్డ్ లైన్ మెంబర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ప్రజల సహకారంతో బాల్యవివాహాలు లేని మండలంగా తీర్చిదిద్దడానికి అధికారులు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమన్నారు. బాల్య వివాహాలు చేసినవారికి, చేసుకున్న వారికి, సహకరించిన వారికి ఏడాది జైలు శిక్ష, రూ.2 లక్షలు జరిమానా విధిస్తారన్నారు. పోక్సో చట్టం ప్రకారం జైలుశిక్షలు తప్పదని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు గ్రామస్తుల దృష్టికి వస్తే వెంటనే చైల్డ్ లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, మండల కోఆర్డినేటర్ బాలాజి, ఎఎస్ఐ దీన్‌దయాల్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, వీఆర్వోలు, పంచాయతీ సెక్రెటరీలు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అల్కో ఇంజన్‌కు ఘనంగా వీడ్కోలు



ఆల్కో డీజిల్ లోకో ఇంజిన్‌కు వీడ్కోలు పలుకుతున్న కార్మికులు

ప్రజాశక్తి-గుత్తి

డీజిల్ లోకో షెడ్ నిర్వహణ చేస్తున్న చివరి ఆల్కో డీజిల్ లోకో ఇంజన్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం గుత్తి డీజిల్ లోకో షెడ్‌లో జరిగిన కార్యక్రమంలో సీనియర్ డిఎంఇ రమేష్, డిఎంఇ ప్రమోద్ లు ప్రత్యేక పూజలు చేసి 14627 డీజిల్ ఇంజన్‌ను ఇతర షెడ్‌కు సాగనంపారు. ఈ సందర్భంగా గుత్తి షెడ్ సీనియర్ డిఎంఇ రమేష్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా గుత్తి షెడ్ సిబ్బంది నిర్వహణలో ఈ అమెరికన్ లోకో మోటివ్ ఇంజన్ భారతీయ రైల్వేకు విశేష సేవలు అందించి బియ్యం, పప్పు ధాన్యాలు, ప్రజలకు ఉపయోగ పడే ఇతర నిత్యావసర వస్తువులను ఎందరో ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చిందన్నారు. త్వరలో గుత్తి షెడ్‌కు తక్కువ నిర్వహణ, నూతన సాంకేతికత, టెక్నాలజీ కలిగిన జి9 ఇంజన్లు 250 రానుండటంతో పాత ఇంజన్లను ఇతర షెడ్లకు పంపుతున్నామన్నారు. ప్రస్తుతం గుత్తి షెడ్‌నిర్వహణలో ఉన్న పి4, జి4 ఇంజన్లు కూడా త్వరలో మౌలాలి, విజయవాడ షెడ్‌లకు పంపుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు డీజిల్ షెడ్ ఉద్యోగులు మాట్లాడుతూ తమ షెడ్‌లో మరమ్మతు, నిర్వహణ చేసిన ఇంజన్‌లు ఇంతవరకు లోపాలతో నిలిచిపోలేదన్నారు. ప్రతి ఇంజన్‌ను తమ కన్న తల్లిలా చూసుకొని మరమ్మతులు చేశామన్నారు. భవిష్యత్తులో అల్కో ఇంజన్ మరమ్మతు చేసే అవకాశం లేనందున బాధగా ఉందని కొందరు బాధాతప్త హృదయంతో తెలిపారు. అనంతరం డీజిల్ ఇంజన్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి గుత్తి షెడ్ నుంచి సాగనంపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఇ లు విజయానంద్, ప్రభుదాస్, షెడ్ కార్మికులు రాజేంద్ర ప్రసాద్, తిరుమలరెడ్డి, రామాంజనేయ రెడ్డి, ప్రకాష్, బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జగన్ పై ఆరోపణలు చేసే అర్హత కేశవ్‌కు లేదు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



బుక్‌లెట్లు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

వైఎస్ వివేకానందరెడ్డి హత్య వ్యవహారంపై టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నాడని, జగన్‌పై ఆరోపణలు చేసే నైతిక అర్హత పయ్యావుల కేశవ్‌కు లేదని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. లేని అంశాన్ని ఉన్నట్టుగా ప్రచారం చేస్తున్నారని, జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో పయ్యావుల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాడని ధ్వజమెత్తారు. ఉరవకొండ పట్టణంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సమక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గోబెల్స్ ప్రచారం చేయడంలో పయ్యావుల దిట్ట అని అన్నారు. అందుకే బొడిగుండుకి మోకాలికి ముడిపెడుతున్నాడన్నారు. విశాఖపట్నం రాజధాని అని జగన్ ప్రకటన చేస్తే వివేకా హత్యను కేశవ్ తెరపైకి తీసుకురావడమే ఇందుకు నిదర్శనమన్నారు. వివేకా హత్యకు జగన్‌కు ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. సిఎం జగన్‌పై ఆరోపణలు చేసే నైతిక అర్హత కేశవ్‌కు లేదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై హైదరాబాదుకే పరిమితమైన కేశవ్ నీతులు మాట్లాడడం సరికాదన్నారు. యువశక్తి పాదయాత్రలో లోకేష్ తన అరగంట ప్రసంగంలో 30 తప్పులు మాట్లాడుతున్నాడన్నారు. దీంతో చంద్రబాబుతో సహా వారి పార్టీ డీలా పడిపోయిందన్నారు. దీని నుంచి బయటపడేందుకే పయ్యావుల కేశవ్ బోడిగుండుకు, మోకాళికి ముడిపెడుతూ జగన్మోహన్‌రెడ్డి పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఆయన తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో కార్మికులకు తీవ్ర అన్యాయం : సిఐటియు



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర బడ్జెట్, కార్మిక, వెనుకబడిన ప్రాంతాలకు అన్యాయం చేసేదిలా ఉందని సిపిటియు నాయకులు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం వద్ద బడ్జెట్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత బడ్జెట్ కార్మికులు, రైతులకు తీవ్ర అన్యాయం చేసేదిలా ఉందన్నారు. వెనకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం అన్నారు. ఐసిడిఎస్, మధ్యాహ్నభోజనం, జాతీయ ఆరోగ్యమిషన్, జాతీయ విద్యామిషన్, జాతీయ జీవనోపాధుల మిషన్‌లకు మోడి ప్రభుత్వం కేటాయింపులు పెంచలేదన్నారు. ఉపాధి హామీని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించేదిలా ఉందన్నారు. ఈ ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, ముత్తుజ, ఎర్రిస్వామి, రామాంజనేయులు, శ్రీనివాసులు ఆదినారాయణ, రాజు, రవి కుమార్, శివ, రామాంజనేయులు, మురళి, రామకష్ణ, వీర, సురేష్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బాషావలిషా దర్గా



బబావలిషా దర్గా

ప్రజాశక్తి -అనంతపురం

హిందూ-ముస్లిముల ఐక్యతకు చిహ్నంగా అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామ శివారులో (రాచానపల్లి దర్గా) వెలసిన హజరత్ ఖ్వాజా సయ్యద్ షా మొహమ్మద్ ఖాసిం ఖాద్రీ అల్ మారూఫ్ హజరత్ సయ్యద్ బాషా వలి షా చిస్తీఉల్ ఖాద్రీ స్వామివారి దర్గా నిలుస్తోంది. రాయలసీమ నుండే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుండి భక్తులు ఈ దర్గాను సందర్శించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ప్రతి ఏటా హిందూ, ముస్లిం సోదరులు దర్గా గంధం ఉరుసు ఉత్సవాలు సమైక్యంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల నుండి గంధము-ఉరుసు ఉత్సవ వేడుకలను బనగానపల్లెకు చెందిన సద్గురు హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్ షా ఖాద్రీ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఆదివారం జరిగే ఈ గంధం ఉరుసు ఉత్సవాల్లో పలు ఆధ్యాత్మిక, ఫకీర్ల జల్సాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ దైవ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

పొలంబడి పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

అనంతపురం : పొలంబడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు వేరుశనగ పంటలో అనుసరిస్తున్న పద్ధతులను రైతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని అనంతపురం వ్యవసాయ డివిజన్ ఏడీఏ ఎం.వెంకటరాముడు పేర్కొన్నారు. బుధవారం అనంతపురం రూరల్ మండలంలోని నర్సినాయునికుంట గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ రైతులు అనవసరంగా క్రిమిసంహారక మందులు పిచికారి చేయడం వల్ల ఖర్చులు అధికంగా పెరుగుతున్నాయని, వాటిని తగ్గించాలని రైతులకు సూచించారు. వేరుశనగ పంటలో రసం పీల్చే పురుగులకు ఎల్లో ట్రాప్స్, బ్లూ ట్రాప్స్ పెట్టి వాటినిని వారించుకోవచ్చని సూచించారు. జీవన రేఖ కార్యక్రమంలో భాగంగా రైతులకు పంట రుణాలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం మొదలుగునవి ఇస్తామన్నారు. కౌలు రైతులు సిసిఆర్‌సి కార్డులు చేయించుకోవాలన్నారు. కేవికే రెడ్డిపల్లి శాస్త్రవేత్త రవికిషోర్ రెడ్డి పంటలకు వ్యాపించే తెగుళ్ల, నివారణ మార్గాలను సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వరప్రసాద్, ఎఇఒలు ప్రసాద్, మురళి, విలేజ్ అగ్రికల్చర్, సిరికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, ఎంపిఇఒలు, వ్యవసాయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తాపడి దంపతులకు గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణ శివారులోని గుత్తి- అనంతపురం రోడ్డులో బుధవారం ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దవడుగూరు మండలం విరుపాపురం గ్రామానికి చెందిన రాజు, రాములమ్మ దంపతులు తమ 7 నెలల చిన్నారి సునందకు జ్వరం రావడంతో వైద్యం కోసం ఆటోలో గుత్తికి బయలుదేరారు. గుత్తి-అనంతపురం రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని మలుపులో వేగంగా వస్తున్న ఆటో అదుపు తప్పి మూడు పల్టీలు కొట్టింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాజు, ఆయన భార్య రాములమ్మ తీవ్రంగా గాయపడ్డారు. చిన్నారి సునంద ఎలాంటి గాయాలు లేకుండా బయటపడింది. గాయపడ్డ వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వారిని అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి-పుట్లూరు

అనారోగ్యంతో తీవ్ర మనస్తాపం చెంది ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుట్లూరు మండలం ఎస్.తిమ్మాపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన కె.అక్కమ్మ (78) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. రోగం నయం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్కమ్మ పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ప్రజాశక్తి-గుత్తి

పట్టణ శివార్లలో 67వ నంబర్ జాతీయ రహదారిపై అధిక టన్నేజీతో ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను విజిలెన్స్ అధికారులు, గుత్తి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం కొత్తపేట బ్రిడ్జి వద్ద విజిలెన్స్ అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు. తాడిపత్రి వైపు నుంచి అధిక లోడుతో వస్తున్న టిప్పర్ ను ఆపి తనిఖీలు చేయగా సరైన పత్రాలతో లేకపోవటంతో పాటుగా అధిక టన్నేజితో ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. విజిలెన్స్ అధికారులు టిప్పర్‌ను గుత్తి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి జరిమానా విధించారు.

గుండెపోటుతో మహిళా కూలీ మృతి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పత్తి పొలంలో పనులు చేస్తూ ఓ మహిళా కూలీ గుండెపోటుతో మరణించిన సంఘటన పెద్దవడుగూరు మండలం దిమ్మగుడిలో బుధవారం చోటుచేసుకుంది. దిమ్మగుడి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన నాగలక్ష్మి (55) అదే గ్రామానికి చెందిన పుల్లారెడ్డి పత్తి పొలంలో పనులు చేసేందుకు వెళ్లింది. పొలంలో పుల్లలు ఏరుతూ గుండెపోటుకు గురై అక్కడే కుప్పకూలి మరణించింది. మృతురాలికి భర్త తిరుపాలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

బ్రహ్మసముద్రం : ఐమాక్స్ లైట్లకు అనుమతి మంజూరుచేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని టిడిపి మండల కన్వీనర్ పాలకొండ శ్రీరాములు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని స్థానిక బస్‌స్టాండ్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని రూ.2.30 లక్షలు విరాళాలు సేకరించామన్నారు. లైట్లు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని పంచాయతీ అధికారి మురళీకి వినతిపత్రం అందజేశామన్నారు. అనుమతి కోసం వారం రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సర్పంచి పూజ, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఐమాక్స్ లైట్లు ఏర్పాటుకు అనుమతి మంజూరుచేయాలని ఎంపిడిఒ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నందకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి గుండిగానిపల్లి కురుగోడ, తెలుగు యువత నాయకులు నీలాస్వామి, క్లస్టర్ కన్వీనర్ నాగరాజు, ఓబులేసు, నాయీ బ్రాహ్మణ సంఘం తాలూకా అధ్యక్షులు నరసింహులు, టిడిపి నాయకులు శివారెడ్డి, వెంకటేష్, పరమేష్, శివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లస్కర్లకు రూ.15 వేలు ఆర్థిక చేయూత

బొమ్మనహాల్ : తుంగభద్ర ప్రధాన హెచ్ఎల్‌సి కాలువ కింద కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న లస్కర్లకు బొమ్మనహాల్ మండలం దేవగిరి గ్రామానికి డాక్టర్ రాజ్‌కుమార్ బుధవారం రూ.15 వేలు ఆర్థిక చేయూతను అందజేశారు. మండలంలోని తుంగభద్ర ప్రధాన కాలువ కింద, కనేకల్ సెక్టారు పరిధిలో 24 మంది లస్కర్లు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. వారు నెలకు 26 రోజులు చొప్పున ఆరు నెలలు పనిచేయాలని, రోజుకు రూ.350 కూలి చెల్లించేలా హెచ్ఎల్‌సి అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే నాలుగేళ్లుగా వారికి ఎలాంటి గౌరవ వేతనం ఇవ్వలేదు. వీరు పంటలకు నీరు వదిలి, రైతులిచ్చే కొద్దిపాటి ధాన్యంతో జీవనం సాగిస్తున్నారు. వారి పరిస్థితిని గమనించిన డాక్టరు రవికుమార్ వారికి తనవంతుగా రూ.15 వేలు ఆర్థిక చేయూతను అందించారు. గౌరవ వేతనంపై హెచ్ఎల్‌సి కనేకల్ సెక్టరు డిఇ గోపాల నాయక్‌ను ప్రజాశక్తి వివరణ కోరింది. దీనికి స్పందించిన ఆయన ప్రభుత్వానికి నివేదిక పంపామని, వారి ఆదేశాల మేరకు త్వరలోనే లస్కర్ల ఖాతాల్లో డబ్బు జమచేస్తామని చెప్పారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు పాలవెంకటాపురం విద్యార్థిని

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పాల వెంకటాపురం గ్రామం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పాలబండ్ల ఇందు జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఇఒ ఓబులపతి, ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, ఫిజికల్ డైరెక్టర్ ఇబ్రహీం తెలిపారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన 66వ రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్ 14 త్రోబాల్ పోటీలలో అనంతపురం జిల్లా విద్యార్థినుల జట్టు రన్నర్‌గా నిలిచిందన్నారు. పోటీలలో అద్భుతంగా రాణించి తమ పాఠశాల విద్యార్థిని ఇందు జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినిని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ

బెలుగుప్ప : మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించే పశు వైద్యశాల భవన నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పశుఆధారిత ఉత్పత్తులపై ఆధారపడి జీవించే వారి జీవితాలలో వెలుగు నింపడమే లక్ష్యంగా సిఎం జగన్ పశువులు, అనుబంధ రంగాలకు చేదోడుగా ఉంటున్నారన్నారు. 104, 108 తరహాలో అంబులెన్స్ సేవలు అందించే విధానం తరహాలోనే డా.వైఎస్ఆర్ సంచార పశు వైద్య సేవా పథకం ప్రారంభించడం ద్వారా ప్రతి నియోజకవర్గంలో ఒక అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. జెడ్పిటిసి మమత, సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్‌చంద్ర, మాజీ సర్పంచి రామేశ్వరరెడ్డి, నక్కలపల్లి సర్పంచి రామిరెడ్డి, నాయకులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి సన్మానం

ఉరవకొండ : ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని వైసిపి మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం ఉరవకొండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తనకు టౌన్‌బ్యాంకు ఎన్నికల్లో డైరెక్టర్ పదవి లభించేదుకు కృషిచేసిన విశ్వేశ్వరరెడ్డికి ఇంతియాజ్‌బాషా ధన్యవాదాలు తెలిపారు. తన మీద ఉంచిన నమ్మకానికి బాధ్యతగా విధులు నిర్వహించడమే కాకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఇంతియాజ్‌బాషా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వన్నూరు సాహెబ్, మండల కోఆప్షన్ మెంబర్ పామిడి సలీం, దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూర్ బాషా, వడ్ల సలీం, బ్యాళ్ల ప్రసాద్, జెకె.జిలాన్, ఎం.రఫిక్, ఆసిఫ్, వార్డు మెంబర్ శర్మాస్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జిఎంఎస్.బాషా, వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జిలాన్ బాషా పాల్గొన్నారు.